క్లుప్తంగా

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడికి సన్మానం



వర్షిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చిట్యాల: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన నాగం వర్షిత్‌రెడ్డిని శుక్రవారం చిట్యాల మండలానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వర్షిత్‌రెడ్డిని కలిసిన వారిలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు అంశల అనిల్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అంతటి వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మొక్కులు తీర్చుకున్న వీరేశం అభిమానులు



శబరిమలలో ఎమ్మెల్యే వీరేశం ఫ్లెక్సీతో అయ్యప్ప మాలధారులు

నకిరేకల్ : వేముల వీరేశం నకిరేకల్ ఎమ్మెల్యేగా విజయం సాధించాలని కోరుకుంటూ ఆయన అభిమానులు ఎన్నికలకు ముందు అయ్యప్ప మాల ధరించారు. ఎమ్మెల్యేగా వేముల వీరేశం భారీ మెజార్టీతో విజయం సాధించడంతో శబరిమలలో శుక్రవారం ఇరుముడు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీక్షలో కుంభం రవిగౌడ్, నారి నరేష్, పుట్ట శంకర్, పందిరి పరుశరాములు, సాయినాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్‌ను కలిసిన అల్లుబెల్లి



దీపాదాస్ మున్షితో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షిని నార్కట్‌పల్లి మాజీ జెడ్పీటీసీ అల్లుబెల్లి రవీందర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రామగిరి(నల్లగొండ): ఫిబ్రవరి 3న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర బాధ్యుడు ఇందూరు సాగర్, జిల్లా కార్యదర్శి పోలె పవన్ కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నల్లగొండ పట్టణ కేంద్రంలో శుక్రవారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. విద్యారంగం కార్పొరేటీకరణ చేయడాన్ని అడ్డుకట్ట వేయడానికి ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు న్యూ ఢిల్లీలో అఖిల భారత నిరసన ర్యాలీ నిర్వహించనున్నామని, 3న జంతర్ మంతర్ వద్ద వేలాది మందితో మహాధర్నా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రజలు భారీగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలె వెంకట్, బొర్రాజు రవి, ఇందూరు మధు, కామళ్ల సవిందర్, ప్రభాకర్, ఎమ్.సురేష్, జాన్ రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

కేతేపల్లి: నూతన ఓటరు నమోదుకు ఈ నెల 20, 21 తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని కేతేపల్లి మండల తహసీల్దారు ఎన్.మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కానివారు ఓటరు జాబితాలో పేరు నమోదుకు, చిరునామా తదితర సవరణల కోసం రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు ఆయా గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

మర్రిగూడ: మండల వ్యాప్తంగా శనివారం, ఆదివారం ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బక్క శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో బీఎల్‌వోలకు స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదు కాని ప్రతిఒక్కరు ఓటరు జాబితాలో నమోదు, చిరునామా తదితర అంశాల సవరణపై స్పెషల్ క్యాంపెయిన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట డీటీ జూటూరు తారకరామన్, ఆర్‌ఐ బషీర్‌అలీ ఉన్నారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్లు



చీకటిగూడెంలో బస్‌షెల్టర్ ఎదుట నిలిపిన లారీలు



కొర్లపహాడ్‌లో బస్‌షెల్టర్ ఎదుట ఆరబోసిన ధాన్యం రాశులు (ఫైల్)

- బస్‌బేలోకి రాని బస్సులు
- హైవే పైనే నిలుపుదల
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

కేతేపల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో 65వ నంబరు జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన బస్‌షెల్టర్ల వద్ద బస్సులు నిలపకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో నిలువ నీడ కరువై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయిన తర్వాత మండలంలోని కొర్లపహాడ్, చీకటిగూడెం, ఉప్పలపహాడ్, కేతేపల్లి గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిర్మించారు. బస్‌షెల్టర్ల వద్ద బస్సులు నిలిపినపుడు జాతీయ రహదారిపై వెళ్లే ఇతర వాహనాలకు ఆటంకం కలగకుండా బస్‌షెల్టర్ల ఎదుట బస్‌బేలు సైతం ఏర్పాటు చేశారు. అయితే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బస్‌బేలలోకి బస్సులు, ఆటోలు వెళ్లకుండా డ్రైవర్లు రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీంతో బస్సుల కోసం వేచి చూసే వారు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ నిలబడుతున్నారు.

బస్ షెల్టర్ల ఎదుట ధాన్యం ఆరబోస్తున్న రైతులు

కేతేపల్లి మండల పరిధిలోని చీకటిగూడెం, కొర్లపహాడ్ గ్రామాల్లో బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉండడంతో రైతులు ధాన్యం ఆరబోసేందుకు కల్లాలుగా ఉపయోగించుకుంటున్నారు. కేతేపల్లి మండలకేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామం ఒక చివర నుంచి మరో చివర వరకు నిర్మించిన సర్వీసు రోడ్లపై బస్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ స్టాపు ఉన్న బస్సులను సర్వీసు రోడ్లపైకి మళ్లించాలి. సర్వీసు రోడ్డుపై బస్‌షెల్టర్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుని గ్రామానికి మరో చివర నుంచి బస్సులను హైవేపైకి మళ్లించాలి. అలా కాకుండా డ్రైవర్లు ఆర్టీసీ బస్సులను నేరుగా హైవేపైనే నిలుపుతున్నారు.

ప్రమాదాలబారిన పడుతున్న ప్రయాణికులు

హైవే విస్తరణలో భాగంగా నిర్మించిన బస్‌షెల్టర్ల వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గంటల తరబడి ఎండలో రోడ్డుపైనే నిరీక్షిస్తుండడంతో అస్వస్థతకు గురవుతున్నారు. హైవేపై నిత్యం వాహనాల రద్దీ కారణంగా బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు తరుచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. బస్‌షెల్టర్లు నిరుపయోగంగా ఉండడంతో అవి మాంసం విక్రయదారులకు, తాగుబోతులకు అడ్డాగా మారాయి. బస్సులను బస్‌షెల్టర్ల వద్దనే నిలిపేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలో నిలబడాల్సి వస్తోంది



బస్సులు బస్‌బేలోకి రాకపోవడం వల్ల ప్రయాణికులు గంటల తరబడి ఎండలో నిలబడాల్సి వస్తోంది. హైవే పక్కనే ఉండాల్సి రావడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. సర్వీస్ రోడ్ల మీద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ల వద్ద బస్సులు నిలపకపోవడంతో బస్‌బేలు నిరుపయోగంగా మారాయి.

– మాదగోని లక్ష్మణ్, కొర్లపహాడ్

బస్‌షెల్టర్ వద్ద బస్సులు నిలిపేలా చూడాలి



కేతేపల్లిలో చదువుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతిరోజు విద్యార్థులు వస్తుంటారు. బస్‌షెల్టర్ వద్దకు బస్సులు రాకపోవడంతో ఇళ్లకు వెళ్లేటప్పుడు వాహనాల కోసం విద్యార్థులు రోడ్డుపై ఎండలోనే నిలబడుతున్నారు. బస్‌షెల్టర్ వద్ద బస్సులు నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టి. నర్సింహాచారి, కేతేపల్లి

మున్సిపల్ కమిషనర్‌గా ఆర్డీఓకు అదనపు బాధ్యతలు



రవికి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు

నల్లగొండ టూటౌన్: నీలగిరి మున్సిపల్ కమిషనర్‌గా ఆర్డీఓ రవికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ హరిచందన ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు పని చేసిన కందుకూరి వెంకటేశ్వర్లు నుంచి ఆర్డీఓ రవి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రవికి ఇన్‌చార్జ్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు వెంకన్న, అశోక్‌కుమార్, ఇతర అధికారులు బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా త్వరలో పార్లమెంట్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో బదిలీలు ఉంటాయనే కారణంగా వెంకటేశ్వర్లు కమిషనర్ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు సమాచారం.

చండూరు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

చండూరు : ఐదు నెలలుగా తమ కాలనీల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని చండూరు మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం పలువురు ఫిర్యాదు చేశారు. చండూరు పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో మిషన్ భగీరథ పైపులైన్ రోడ్డు మరమ్మతు కార్యక్రమాల్లో భాగంగా పగిలిపోయిందని ఎన్నిమార్లు తెలిపినా మున్సిపల్ సిబ్బంది, రోడ్డు కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. శిరంశెట్టి శ్రీధర్‌బాబు, ఆచారి, సంకోజు సోమబ్రహ్మం, సంకోజు భాస్కర్, తాడిశెట్టి భిక్షమయ్య, సంకోజు భిక్షమయ్య పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని ఖాజీరామారంలో గ్రామ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిరంలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆ సమయంలో భక్తిశ్రద్ధలతో అక్షింతలను చల్లుకోవాలని రామాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి నివాసంలో ఐదు దీపాలు వెలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ అధ్యక్షుడు సల్వాది చిన్న సైదులు, షబ్బీర్ బాబ, సుంకరి సైదులు, జానయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కేంద్రం దృష్టి సారించాలి

మర్రిగూడ: దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం మర్రిగూడ మండల కేంద్రంలో బుర్ర శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి, పేదల సొమ్మును దోచిపెట్టిందన్నారు. నియంతృత్వ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులైన ఎస్‌ఎల్‌బీసీ, చర్లగూడెం రిజర్వాయర్‌ను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల భిక్షంరెడ్డి, బూడిద సురేష్, నిరంజన్, రఘుమయ్య, గిరి, బాలకిషన్, కొమరయ్య, నరసింహ, రవి పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

కట్టంగూర్ : బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీజేపీ మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సూచించారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించే ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆలయంలో భక్తులు పూజలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకన్న, పార్లమెంట్ విస్తరిక్ అఖిల్, అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, కో కన్వీనర్ ప్రభాకర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్, కోమటి భాస్కర్, గున్నాల నాగరాజు, కారంపూడి సాయికుమార్, బొడ్డుపల్లి అంజి, నవీన్, వినోద్ పాల్గొన్నారు.



కట్టంగూర్ : మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలి

నకిరేకల్: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని భువనగిరి మాజీ ఎంపీ, విశ్వకర్మ యోజన రాష్ట్ర కన్వీనర్ బూర నర్సయ్యగౌడ్ పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్ శుక్రవారం విశ్వకర్మ యోజన, నర్సన్న బీమా కుటుంబానికి ధీమా, వికసిత భారత్ కార్యక్రమాలపై బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మైల నరసింహ, కో కన్వీనర్ మాదురు ప్రభాకర్, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు పల్స శ్రీనివాస్‌గౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుడుగుంట్ల సాయన్న, మాస శ్రీను, మైల శ్రీనివాస్, చెనగాని రాములు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి సమష్టిగా పనిచేయాలి

చిట్యాల: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. చిట్యాలలో శుక్రవారం జరిగిన బీజేపీ మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఎం విశ్వకర్మ యోజనను అర్హులైన కుల వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బందారపు లింగస్వామి, నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ, కో కన్వీనర్ మాదూరి ప్రభాకర్‌రావు, భువనగిరి పార్లమెంట్ విస్తారక్ అఖిల్ మీర్జా, జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి కన్నెబోయిన మహాలింగం, ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ సభ్యుడు మాస శ్రీను, మండల అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహ, చిట్యాల పట్టణ ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గుండాల నరేష్‌గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు నర్రా మాధవి పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వందశాతం వసూలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రవి



పాల్గొన్న మున్సిపల్ ఉద్యోగులు

నల్లగొండ టూటౌన్: ఆస్తి పన్ను వసూలుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వంద శాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ రవి అన్నారు. శుక్రవారం నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్తి పన్ను వసూలు చేసే 16 బృందాలు రోజువారీ నివేదిక తనకు అందజేయాలని సూచించారు. ప్రతి విభాగం ఉద్యోగులు సమయ పాలన పాటించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరారు. చిన్న, చిన్న సమస్యల కోసం కార్యాలయం చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పోస్టల్ డివిజన్ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో నిర్వహిస్తున్న ఫిలాటెలిక్–2024 ఎగ్జిబిషన్ శుక్రవారం ముగిసింది. రెండు రోజులుగా జరిగిన ఎగ్జిబిషన్‌ను నల్లగొండ పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తిలకించారు. శుక్రవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి బహుమతులు అందజేశారు.

గోమాతకు పూజలు

నకిరేకల్ : మున్సిపాలిటీలోని ఒకటో వార్డు రంగారెడ్డినగర్‌లో కాలనీవాసులు గోమాతను కొను గోలు చేసి పూజలు నిర్వహించారు. శుక్రవారం అర్చకుడితో గోమాతకు పూజలు చేయించారు. గోమాతను పసుపు కుంకుమతో అలకరించి మెడలో గంట కట్టి పూలదండ వేసి దేవుడి ఆవుగా నామకరణం చేసి కాలనీలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ కందాల భిక్షంరెడ్డి, కాలనీ ప్రతినిధులు అశోక్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జానకిరెడ్డి, విజయ్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు పూజలు చేస్తున్న కాలనీవాసులు

దళిత బంధు గ్రౌండింగ్ చేయాలని ధర్నా

నల్లగొండ టూటౌన్: గత ప్రభుత్వ హయాంలో దళితబంధు కింద ఎంపిక చేసినవారికి దళితబంధు యూనిట్ల గ్రౌండింగ్ వెంటనే ప్రారంభించాలని దళితబంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శాలిగౌరారం మండలానికి చెందిన 270 మందితో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో ఎంపిక చేసినవారికి దళిత బంధు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మామిడి రమేష్, ఏర్పుల నరేందర్, నవీన్, శంకర్, మామిడి యాకుబ్, అద్దంకి రవీందర్, గణేష్, మాచర్ల వెంకట్, ఈర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

రైస్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న నాయకులు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలోని హనుమాన్ రైస్ ఇండస్ట్రీస్ నుంచి వెదజల్లుతున్న వ్యర్థ జలాలు వాయిళ్లబాయి కుంటలోనికి వెళ్లి కుంటలోని నీరు కలుషితమవుతోందని చిట్యాల మండల సీపీఐ కార్యదర్శి అక్బర్, చిట్యాల పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్ ఆరోపించారు. వట్టిమర్తి గ్రామ పరిధిలో గల వాయిళ్ళబాయి కుంటను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుంటలోని నీటిని కలుషితం చేస్తున్న రైస్ మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బొల్గూరి లింగయ్య, దేశగాని బాలరాజు, మేకల భిక్షం, రావుల చిన్న వెంకన్న, సత్తయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

చిట్యాల: 'బేటీ బచావో–బేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిట్యాల, ఉరుమడ్ల, తాళ్ళవెల్లెంల గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లింగ వివక్షత, మహిళా చట్టాలు, అక్షరాస్యత, ఆహార భద్రత, పిల్లల పోషణ వంటి అంశాలపై గర్భిణులకు, కిశోర బాలికలకు, యువతులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు దాడి అరుణ, జంపాల నాగమణి, అలివేలు, మంగమ్మ, సుజాత, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కొండాపురం గ్రామంలో..

చండూరు : మండలంలోని కొండాపురం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సాధికారతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివేషా మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమణమ్మ, నాగమణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చిట్యాల : అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

నకిరేకల్: పట్టభద్రులు కొత్తగా తమ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ నేత దైద రవీందర్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్‌నాయక్‌కు ఓటు హక్కు దరఖాస్తు అందజేసి మాట్లాడారు.

సీఎంను కలిసిన అమర్‌పాల్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డితో అమర్‌పాల్‌రెడ్డి

మర్రిగూడ: మండల పరిధిలోని వట్టిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ కాంగ్రెస్ ఎస్‌ఆర్‌ఐ సెల్ మెంబర్ బట్టు అమర్‌పాల్‌రెడ్డి శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని లండన్‌లో కలిశారు. లండన్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, తెలంగాణ వాసుల స్థితిగతులను సీఎంకు వివరించినట్లు అమర్‌పాల్‌రెడ్డి తెలిపారు.

గద్దర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

చిట్యాల: ప్రజా యుద్ధనౌక గద్దర్ జయంతిని ఈ నెల 31వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ఎంఎస్‌ఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చేకూరి గణేశ్‌మాదిగ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం, బలహీన వర్గాల్లో చైతన్యం నింపడం కోసం తన ఆట పాటలతో ఉద్యమాలు, పోరాటాలు చేసి గద్దర్ జైలు జీవితం గడిపారని అన్నారు.

రమేష్ మృతదేహానికి నివాళులర్పించిన జడ్జి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న జడ్జి తిరుపతి

నార్కట్‌పల్లి: జిల్లా కోర్టులో అటెండర్‌గా పనిచేస్తున్న నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన చిక్కుల రమేష్ గురువారం రాత్రి నల్లగొండ నుంచి నార్కట్‌పల్లికి బైక్‌పై వస్తూ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం నార్కట్‌పల్లిలో రమేష్ మృతదేహానికి నల్లగొండ జిల్లా కోర్టు మొదటి అదనపు జడ్జి తిరుపతి నివాళులర్పించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలో రమేష్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ గిరిజన ఉపాధ్యాయ సంఘం (టీజీఎస్‌యూ) డైరీ, క్యాలెండర్‌ను డీఈఓ భిక్షపతి శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రామచంద్రయ్య, టీజీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రమావత్ నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణకాంత్‌నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బానావత్ సైదులునాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడ్ తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

మునుగోడు: మండలంలోని చొల్లేడు గ్రామంలో ఓ కిరాణ దుకాణంలో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై శుక్రవారం మునుగోడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయించవద్దని ఇటీవల ఆదేశాలు జారీచేయడంతోపాటు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినప్పటికీ చొల్లేడు గ్రామంలో మద్యం విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. తన సిబ్బందితో ఆ గ్రామానికి వెళ్లి 7 దుకాణాల్లో తనిఖీలు చేయగా గ్రామ శివారులోని మాదాసు యాదయ్య కిరాణ దుకాణంలో 20 క్వార్టర్ బాటిళ్లు పట్టుబడ్డాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని యాదయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలో బెల్టు షాపుల ద్వారా మద్యం విక్రయిస్తే సహించేది లేదని, ఎంతటివారైనా కేసులు తప్పవని హెచ్చరించారు.



మద్యం పట్టుకున్న పోలీసులు

ఇండియన్ టాలెంట్ టెస్ట్‌లో ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

రామగిరి(నల్లగొండ): ఇండియన్ టాలెంట్ టెస్ట్‌లో నల్లగొండ పట్టణంలోని ఏకలవ్య ఫౌండేషన్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇండియన్ టాలెంట్ సంస్థ వారు నిర్వహించిన సైన్స్, మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో ఏకలవ్య స్కూల్‌కు చెందిన 55 మంది విద్యార్థులు సెకండ్ లెవల్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి, డైరెక్టర్లు మారం శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులు